క్లుప్తంగా

నేడు సచివాలయ భవనాల ప్రారంభోత్సవం


జొన్నగిరి సచివాలయ భవనం

తుగ్గలి: మండల పరిధిలోని జొన్నగిరిలో సచివాలయ భవనాల నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యాయి. గ్రామంలో రూ.87.20 లక్షలతో నిర్మించిన రెండు సచివాలయాలను శుక్రవారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల, సచివాలయ అధ్యక్షులు జిట్టా నాగేష్‌యాదవ్, హనుమంతు తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

గట్టు ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు

ఆలూరు: హొళగుంద మండలం దేవరగట్టులో వెలసిన మాళమల్లేశ్వర స్వామి ఉత్సవాలకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ ఈనెల 19 నుంచి 28వ తేదీ వరకు ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. 24న బన్ని ఉత్సవం ఉంటుందని తెలిపారు. భక్తులు వేలాది సంఖ్యలో తరలిరానున్న నేపథ్యంలో వారికి ఇబ్బంది కలగకుండా తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, రోడ్ల మరమ్మతులు, వాహన పార్కింగ్ తదితర సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఉత్సవ నిర్వణపై 15వ తేదీలోగా ఆయా గ్రామాల పెద్దలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

ఘనంగా ఎర్రకోట జగన్ జన్మదిన వేడుకలు

ఎమ్మిగనూరు టౌన్: ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఎమ్మెల్యే నివాసంలో గురువారం ఘనంగా జరిగాయి. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్ క్రేన్‌తో గజమాల వేసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శులు లక్ష్మీకాంతరెడ్డి, రియాజ్‌అహమ్మద్, పట్టణ అధ్యక్షులు బుట్టా రంగయ్య, టౌన్‌బ్యాంక్, కో–ఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్లు యుకే రాజు, షబ్బీర్ అహమ్మద్ తదితరులు ఆయనకు శుభాకాంక్షలు చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ


ఎఫ్ఏ–2లో ప్రతిభ చాటిన విద్యార్థులతో జెడ్పీటీసీ ఏరూరు శేఖర్

ఆలూరు రూరల్: నాడు–నేడు పథకం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ తీసుకువచ్చారని జెడ్పీటీసీ ఏరూరు శేఖర్ అన్నారు. గురువారం ఆయన స్థానిక ఉర్దూ హైస్కూల్‌లో జలజీవన్ మిషన్ కింద మంజూరైన బోరును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యారంగంలో సమూల మార్పులు తీసుకువచ్చి వారి ఉన్నత విద్యకు భరోసా కల్పిస్తోందన్నారు. బోరు ఏర్పాటు కృషి చేసిన జెడ్పీటీసీని ఎంఈఓలు కోమలాదేవి, చిరంజీవి రెడ్డి, హెచ్ఎం సావిత్రి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎఫ్ఏ–2 ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు.

అల్లీపీర స్వామి దర్గాలో గద్వాల ఎమ్మెల్యే పూజలు

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలోని అల్లీపీర స్వాముల దర్గాను గురువారం రాత్రి తెలంగాణ రాష్ట్రం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి దర్శించుకున్నారు. ముందుగా దర్గా పీఠాధిపతి ఘాజీ హుసేన్‌పీరా స్వాములకు శాలువా కప్పి సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు. దర్గాలో ప్రత్యేక పార్థనలు చేశారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో గద్వాల బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా మరోసారి పోటీలో బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఉన్నారు. ఎమ్మెల్యేతో పాటు గద్వాల మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీధర్‌గౌడ్ ఉన్నారు.

ఈ–కేవైసీకి నేడే ఆఖరు

కృష్ణగిరి: ఖరీఫ్‌లో పంటల నమోదు చేసుకున్న రైతులు ఈ–కేవైసీ చేసేందుకు శుక్రవారంతో గడువు ముగుస్తుందని మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. మండల వ్యాప్తంగా 16,472 మంది రైతులు 55,600 ఎకరాల్లో సాగు చేసిన పంటలను ఈ–క్రాప్‌లో నమోదు చేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకు 14,525 మంది రైతులు మాత్రమే ఈ–కేవైసీ నమోదు చేసుకున్నారన్నారు. మిగిలిన రైతులందరూ శుక్రవారం సాయంత్రంలోగా ఈ–కేవైసీ చేయించుకుంటేనే వారికి ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు అందుతాయని, రైతులు ఈ విషయాన్ని గుర్తించుకోవాలని సూచించారు.
మద్దికెర: మండలంలోని ఆయా గ్రామాలలో ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులకు సంబంధించి 92 శాతం ఈ–కేవైసీ పూర్తి చేసినట్లు ఏఓ రవి తెలిపారు. 6123 మంది రైతులకు గాను 5618 మందికి ఈ–కేవైసీ చేయడం జరిగిందన్నారు. ఇంకా 505 మంది రైతులు నమోదు చేయించుకోలేదన్నారు. ఈ–కేవైసీ చేయించుకోకపోతే ప్రభుత్వ సబ్సిడీ పథకాలు వర్తించవన్నారు.


కడమకుంట్లలో వైద్య శిబిరంలో ఓపీ తీసుకుంటున్న జనం



చిగిళిలో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ నాగేశ్వరరావు


పెరవలిలో వైద్య శిబిరానికి వచ్చిన జనం


చిట్యాలలో ఓపీ నమోదు చేసుకుంటున్న ప్రజలు

వైఎస్సార్‌సీపీతో వైద్య వ్యవస్థ బలోపేతం

వెల్దుర్తి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో వైద్య వ్యవస్థను బలోపేతం చేసిందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఎమ్మెల్యే స్వగ్రామం చెరుకులపాడులో ఏర్పాటు చేసిన సురక్ష హెల్త్ క్యాంప్‌ను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. చెరుకులపాడు, కొసనాపల్లి గ్రామాల నుంచి వైద్య సేవలందుకునేందుకు వచ్చిన 470 మందిని పలకరించి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. మెరుగైన సేవలందించాలంటూ వైద్యాధికారులు డాక్టర్ భువనతేజ, శ్రీధర్‌రెడ్డి, స్పెషలిస్టు వైద్యులు భరత్, అన్నపూర్ణ, కవితలను కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన.. మెడికల్ కళాశాలలు, ఆసుపత్రుల ఏర్పాటు, వైద్యులు, సిబ్బంది నియామకం, తల్లీబిడ్డ సంరక్షణకు పథకాలు, పౌష్టికాహారం పంపిణీ, ఆరోగ్య శ్రీ, 108, 104 సేవలు, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం, గ్రామాల్లో హెల్త్ సెంటర్ల నిర్మాణం తదితర కార్యక్రమాలను వివరించారు. వెల్దుర్తి సొసైటీ చైర్మన్ కంగాటి వంశీధర్ రెడ్డి, శివారెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస రావ్, వైస్ ఎంపీపీ రాజేశ్వరి, సర్పంచ్ రాములమ్మ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.
మద్దికెర: ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇళ్ల వద్దకే వైద్యసేవలు అందిస్తున్నారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. పెరవలి గ్రామంలో సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె పర్యవేక్షించారు. వైద్యులు వివిధ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పోషకాహార స్టాళ్లను ఎమ్మెల్యే పరిశీలించి గర్భిణులకు సీమంతం చేశారు.
కృష్ణగిరి: మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో ఎమ్మెల్యే శ్రీదేవి, ఎంపీపీ డాక్టర్ వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ కేఈ సుభాషిణితో కలిసి సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వైద్య సేవలను, పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించి రోగులకు కళ్లజోడు, ఆయుష్మాన్ కార్డులు, మందులను అందజేశారు. ఈ శిబిరం ద్వారా 355 మందికి ఆరోగ్య సేవలు అందించినట్లు వైద్యాధికారి ప్రదీప్ తెలిపారు.
ఆస్పరి: గ్రామాలలో నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎల్‌డీఓ నాగేశ్వర రావు సూచించారు. చిగిళి గ్రామంలో సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన పర్యవేక్షించారు. డీఎల్‌డీఓ మాట్లాడుతూ సురక్ష వైద్య శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. చిగిళిలో 370 మందికి వైద్య సేవలు అందించినట్లు డాక్టర్ రఘురామిరెడ్డి తెలిపారు. డాక్టర్లు గీతావాణి, కల్పన, బాలకృష్ణారెడ్డి, వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.


చెరుకులపాడు హెల్త్ క్యాంప్‌లో సురక్ష కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

ఎమ్మిగనూరురూరల్: ఎర్రకోట గ్రామంలో దైవందిన్నె పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. మండలాధ్యక్షులు గొల్ల కేశన్న పర్యవేక్షించారు. వైద్య సిబ్బంది ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలను అందించారు.
తుగ్గలి: కడమకుంట్లలో గురువారం నిర్వహించిన సురక్ష శిబిరంలో 274 మంది వైద్య సేవలు పొందారు. పౌష్టికాహారంపై ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేసి ఐసీడీఎస్ సూపర్ వైజర్ అంబిక, అంగన్‌వాడీ కార్యకర్తలు పోషకాహారంపై అవగాహన కల్పించారు.
నందవరం: మండలంలోని పూలచింత గ్రామ సచివాలయంలో ఎంపీడీఓ దశరథ రామయ్య ఆధ్వర్యంలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. 494 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.
గోనెగండ్ల: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్లు రవళి, అపర్ణ, రుక్సానా, వెన్నెల, సింధూర 304 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు.
పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పులికొండ గ్రామంలో సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీపీ నారాయణదాస్, సర్పంచ్ అనసూయ, ఎంపీడీఓ పర్యవేక్షించారు. ప్రభుత్వ వైద్యాధికారిణి శ్రావణి పర్యవేక్షణలో రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార స్టాల్స్ ఏర్పాటుచేసి అవగాహన కల్పించారు.
చిప్పగిరి: డేగులహాల్ గ్రామంలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఒక్క రోజులోనే 423 మందికి వైద్య సేవలందించినట్లు అధికారులు తెలిపారు.
ఆలూరు రూరల్: పెద్ద హోతూరు గ్రామ సచివాలయంలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. మొలగవల్లి డాక్టర్ శాంతి ఆధ్వర్యంలో 510 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.
హొళగుంద: వందవాగిలి గ్రామంలో నిర్వహించిన సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. వైద్యాధికారులు న్యూటన్, రాధమ్మ, అనంత నివేదన, మనోజ్‌కుమార్ శిబిరంలో వైద్య సేవలు అందించారు. మెరుగైన వైద్యం అవసరమైన 33 మందిని కర్నూలుకు రెఫర్ చేసారు. శిబిరంలో 521 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు.
హాలహర్వి: సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ పథకం జిల్లా కో ఆర్డినేటర్ బాలమురళీకృష్ణ, తహసీల్దార్ మల్లికార్జున స్వామి సూచించారు. మండలంలోని గూళ్యం గ్రామ సచివాలయం–2లో వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. వైద్యులు మున్నూర్‌వలీ రోగులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఎంపీపీ కురువ పక్కీరమ్మ, సర్పంచ్ ఉలిగమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.
దేవనకొండ: మండలంలోని ఐరన్‌బండ బి.సెంటర్ గ్రామంలో సురక్ష వైద్య శిబిరాన్ని గురువారం వైద్యులు విజయభాస్కర్, అరుంజ్యోతి ప్రారంభించారు. శిబిరాన్ని జిల్లా టీబీ ఆఫీసర్, ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ భాస్కర్ తనిఖీ చేశారు. శిబిరంలో దాదాపు 250 మందికి వివిధ ఆరోగ్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.


పులికొండలో హెల్త్ క్యాంపును పర్యవేక్షిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ


డేగులహాల్‌లో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం


పెద్దహోతూరులో వైద్య సేవలందిస్తున్న సిబ్బంది


ఐరన్‌బండ బి.సెంటర్‌లో వైద్య సేవలను పరిశీలిస్తున్న జిల్లా టీబీ ఆఫీసర్ భాస్కర్

కీళ్ల నొప్పులకు వైద్యం చేయించుకున్నా


నేను ఐదేళ్ల నుంచి కీళ్ల నొప్పులతో బాధపడుతున్నా. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో కీళ్ల నొప్పులకు ఉచితంగా మందులను వైద్యులు అందించారు. ఆ మందులతో కీళ్ల నొప్పులు తగ్గుతాయన్న నమ్మకం ఉంది. ఎన్ని ప్రయివేట్ ఆస్పత్రుల్లో చూపించుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. ఇలాంటి వైద్య శిబిరాలతో మాలాంటి పేదలకు ఎంతో ఉపయోగం.
– గాదిలింగప్ప, గూళ్యం గ్రామం

షుగర్, బీపీ పరీక్షలు ఉచితంగా చేశారు


గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో షుగర్, బీపీ పరీక్షలను ఉచితంగా చేశారు. ప్రతి నెలా నేను బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకునేందుకు బళ్లారి, ఆదోని పట్టణాలకు వెళ్లేదాన్ని. గ్రామంలోనే వైద్యం అందించడంతో రవాణా ఖర్చులు, చికిత్స ఖర్చులు మిగిలిపోయాయి. ఉచితంగా మందులను కూడా ఇచ్చారు. చాలా సంతోషంగా ఉంది.
– గాదెమ్మ, గూళ్యం గ్రామస్తురాలు

కంటి పరీక్షలు చేయించుకున్నా


నాకు కళ్లు సరిగా కనబడక ఇబ్బందులు పడుతున్నాను. కంటి పరీక్షలు చేయించుకునేందుకు ఎక్కడికి వెళ్లాలో తెలియక అలాగే ఉన్నాను. సారోళ్లు వచ్చి కంటి పరీక్షలు చేస్తారని చెప్పడంతో ఇక్కడికి వచ్చారు. పెద్ద డాక్టర్లు కంటి పరీక్షలు చేశారు. కళ్లద్దాలు కూడా ఇస్తామన్నారు. చాలా ఆనందంగా ఉంది.
– సోమేశ్వరమ్మ, పెరవలి, మద్దికెర మండలం

పట్టణాలకు వెళ్లే బాధ తప్పింది


గర్భిణుల పరీక్షల కోసం పట్టణాలకు వెళ్లే బాధ తప్పింది. కర్నూలు వైద్యులే వచ్చి వైద్య పరీక్షలు చేసి మందులు రాసిచ్చారు. అంతకన్నా ఏమి కావాలి. ప్రభుత్వం ఇలాంటి శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించడం సంతోషించదగ్గ విషయం.
– మాధవీలత, పెరవలి, మద్దికెర మండలం.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఆస్పరి: మండలంలోని జొహరాపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ మహేంద్ర గురువారం తెలిపారు. ఈనెల 9వ తేదీన కర్నూలు, నంద్యాలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి బేస్‌బాల్ పోటీల్లో అండర్–14 విభాగంలో 9వ తరగతి విద్యార్థి హరిక్రిష్ణ, 8వ తరగతి విద్యార్థులు రూప, వైష్ణవి, సాఫ్ట్‌బాల్ అండర్–14 విభాగంలో 8వ తరగతి సుధాకర్, కావ్య, సాఫ్ట్‌బాల్ అండర్–17 విభాగంలో 10వ తరగతి విద్యార్థి ఉరుకుందు ఉత్తమ ప్రతిభ చూపడంతో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. అలాగే నగరూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్న రఘువరణ్ సాఫ్ట్‌బాల్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులను హెచ్ఎంలు నిస్సార్ అహ్మద్, రవికుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.
నందవరం: బాలికలు క్రీడల్లో రాణించాలని జెడ్పీ పాఠశాల హెచ్ఎం లలితకుమారి పేర్కొన్నారు. మండల పరిధిలోని నాగలదిన్నెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎం.ఉషారాణి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14 విభాగంలో ఫుట్‌బాల్ క్రీడలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో గురువారం ఆమెను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

మారని రేషన్ డీలర్ తీరు

హొళగుంద: రేషన్ డీలర్ అక్రమాలపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో సహనం కోల్పోయిన కార్డుదారులు గురువారం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. అధికారులతో తమ ఆవేదనను వెళ్లగక్కారు. హొళగుంద ఈబీసీ కాలనీలోని 31వ రేషన్‌షాపులో కార్డుదారులకు నాలుగు నెలలుగా నిత్యావసర సరుకులు సక్రమంగా అందించడం లేదని, డీలర్ వహిదాబేగం, భర్త రఫీక్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. తహసీల్దార్ హుసేన్‌సాహేబ్, ఆర్ఐ దినోజ్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో చాలా సార్లు ఫిర్యాదు చేసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని అధికారులను నిలదీశారు. డీలర్ వహిదాబేగం, భర్త రఫీక్ పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రతి నెలా బియ్యంలో కోత విధిస్తున్నారని ఆరోపించారు. ఇదేంటని అడిగితే కార్డుదారులతో గొడవకు దిగుతున్నారని వాపోయారు. తమకు బియ్యంతో పాటు చక్కెర, బ్యాళ్లు సక్రమంగా అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తహసీల్దారు స్పందిస్తూ ఈ నెల 15వ తేదీకల్లా సరుకులు సక్రమంగా అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు వెనుదిరిగారు.



హొళగుందలో తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తున్న రేషన్‌కార్డుదారులు

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

దేవనకొండ: అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. పి.కోటకొండకు చెందిన మాజీ ఎంపీటీసీ, రైతు జక్కల గిడ్డయ్య (44) తనకున్న 14 ఎకరాల్లో పత్తి, వేరుశనగ, ఆముదం సాగుచేశాడు. పంటల పెట్టుబడుల కోసం రూ.10 లక్షల వరకు అప్పులు చేశాడు. సరైన దిగుబడులు రాకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలనే మనస్తాపంతో ఈ నెల 9న పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా కోలుకోలేక గురువారం మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ సభ్యుడు కిట్టు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మల్లికార్జున తదితరులు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


జక్కల గిడ్డయ్య (ఫైల్)

హొళగుంద: హెబ్బటం గ్రామానికి చెందిన బోయ బూదుగుప్ప శేఖన్న (52) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తులు కథనం మేరకు.. శేఖన్న సొంత పొలం 3.5 ఎకరాలతో పాటు పెద్దవంక చెరువు కింద ఐదెకరాలను కౌలుకు తీసుకుని మిరప సాగు చేశాడు. వర్షాభావ పరిస్థితుల కారణంగా చెరువు నిండకపోవడం, వర్షాలు కురువకపోవడంతో సాగు చేసిన పంట ఎండుముఖం పట్టింది. పంటల సాగుకు పెట్టుబడులు, పొలం కౌలు, పిల్లల పెళ్లిళ్లకు చేసిన అప్పులు దాదాపు రూ.12 లక్షలు అయ్యాయి. దిగుబడులు చేతికందే పరిస్థితి కానరాక మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం పొలానికి పురుగు మందు పిచికారీ చేసేందుకు వెళ్లిన శేఖన్న అదే మందు తాగి ఇంటికి చేరుకున్నాడు. తీవ్ర అస్వస్థతకు గురైన శేఖన్నను కుటుంబసభ్యులు ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించగా రాత్రి కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య జయమ్మ, ముగ్గురు సంతానం ఉన్నారు.


బోయ శేఖన్న (ఫైల్)

పత్తికొండ టౌన్: పత్తికొండ పట్టణంలోని కల్లుపెంట వీధిలో నివాసముంటున్న షేక్ మబ్బాషా (22) గురువారం ఉదయం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సదరు యువకుడు డిగ్రీ పూర్తి చేసి వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎవరూ లేని సమయంలో మబ్బాషా ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.


షేక్ మబ్బాషా (ఫైల్)

తాగునీటి ట్యాంకు ఏర్పాటుకు హామీ

హొళగుంద: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు తాగునీటి సమస్య పరిష్కరించేందుకు 1989–90 బ్యాచ్‌కు చెందిన మిక్కిలినేని ప్రసాద్ అనే పూర్వ విద్యార్థి ముందుకొచ్చారు. 10 వేల లీటర్ల సామర్థ్యంతో రూ.1.50 లక్షలతో నీటి ట్యాంకు నిర్మాణానికి ఆయన గురువారం తండ్రి మిక్కిలినేని రవీంద్రబాబు చేతుల మీదుగా పాఠశాల ఆవరణలో భూమి పూజ చేశారు. పాఠశాలలో 2 వేల మంది విద్యార్థులుండగా నీటి కోసం ఇబ్బందులు పడరాదనే ఉద్దేశంతో దాత సహకారంతో ట్యాంకు ఏర్పాటు చేస్తున్నట్లు హెచ్ఎం నజీర్ అహమ్మద్ తెలిపారు. ఈ సందర్భంగా దాత తండ్రిని సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

17న జాబ్ మేళా

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక మహాయోగి లక్ష్మమ్మవ్వ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 17వ తేదీన ఏపీ నైపుణ్యాభివృద్ధి, శిక్షణా శాఖ, తమ కళాశాల సంయుక్తంగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహబుబ్‌బాషా గురువారం తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన 18 – 35 ఏళ్ల వారు అర్హులని, జాబ్‌మేళాకు విద్యార్హతల సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

నందవరం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీఓ దశరథ రామయ్య లబ్ధిదారులకు, థర్డ్ పార్టీ ఏజెన్సీ సభ్యులకు ఆదేశించారు. గురువారం మండల పరిధిలోని హాలహర్వి గ్రామం జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం జగనన్న కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైయినేజీలు, విద్యుత్ దీపాలు, తాగునీరు వంటి మౌలిక సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. ఇంటి నిర్మాణ బిల్లులు దశల వారీగా పెండింగ్ లేకుండా చెల్లిస్తామని వివరించారు. ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని థర్డ్ పార్టీ సభ్యులకు సూచించారు. హౌసింగ్ ఇన్‌చార్జ్ ఏఈ గురుస్వామి, ఇంజినీరింగ్ అసిసెంట్లు, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు తిమ్మప్ప పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

నందవరం: రబీ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం సబ్సిడీపై అందించిన శనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ మత్రి స్రవంతి సూచించారు. గురువారం మండలంలోని పెద్దకొత్తిలి, నాగలదిన్నె, గురజాల, చిన్నకొత్తిలి గ్రామాల ఆర్బీకేల్లో సబ్సిడీ శనగ విత్తనాల కోసం నమోదు ప్రక్రియ ఏఓ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. క్వింటా శనగ విత్తనాలు సబ్సిడీ పోనూ రైతు వాటా రూ.4,860 చెల్లించాలన్నారు. మండలానికి 150 క్వింటాళ్ల శనగ విత్తనాలను ఉన్నతాధికారులు కేటాయించారన్నారు. ఇప్పటి వరకు రైతులు 40 క్వింటాళ్ల విత్తనాలకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

జేజేఎంతో ఇంటింటికీ తాగునీరు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పందికోన గ్రామంలోని ప్రజలకు ఇంటింటికీ తాగునీరు అందించాలన్న లక్ష్యంతో జల జీవన్ మిషన్ (జేజేఎం) కింద రూ.52 లక్షలతో చేపట్టే కార్యక్రమానికి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి గురువారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. గ్రామ నాయకులు వెంకటేశ్వర్లు, రవి, నారాయణస్వామి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం భూమిపూజ చేశారు. పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. ఎంపీపీ నారాయణదాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరంగడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బాలరాజు ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే శ్రీదేవి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించేలా చూస్తామని భరోసా ఇచ్చారు.


పందికోనలో తాగునీటి పథకానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

ఉపాధి ప్రణాళికలు రూపొందించండి


మాట్లాడుతున్న అధికారి కృష్ణమోహన్

ఆలూరు: వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఆలూరు నియోజకవర్గం క్లస్టర్ పరిధిలో చేపట్టేందుకు ఉపాధి పనుల ప్రణాళికను సిద్ధం చేయాలని జిల్లా ఉపాధి హామీ పథకం అధికారి కృష్ణమోహన్ ఏపీఓ, టీసీ, ఈసీలను ఆదేశించారు. స్థానిక సీఎల్ఆర్సీ కార్యాలయంలో గురువారం ఏపీడీ పక్కీరప్ప సమక్షంలో క్లస్టర్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామ పంచాయతీలో రాక్‌ఫీల్డ్ డ్యాంలు, చెక్‌వాల్స్, ఇంకుడు గుంతలు, మొక్కల పెంపకం, ఫారం పాండ్స్, తదితర పనులను గుర్తించి అంచనా విలువ లెక్కగట్టి నివేదిక సిద్ధం చేయాలన్నారు. ప్రతి మండలానికి సుమారు 250 నుంచి 500 రకాల పనులను గుర్తించి బడ్జెట్ అంచనా రూపొందించాలన్నారు. వీఐఎస్ అధికారి యశోధ, ఆయా మండలాల ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

జనవరి వరకు సాగునీరివ్వాలి

ఎమ్మిగనూరుటౌన్: ఎల్లెల్సీ కింద సాగుచేసిన పంటలకు జనవరి నెలాఖరు వరకు సాగునీరివ్వాలని ఏపీ రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు పంపణ్ణగౌడ్, సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న డిమాండ్ చేశారు. గురువారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎల్లెల్సీ కార్యాలయం వద్ద ధర్నా చేసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏఈ మణికంఠకు ఇచ్చి మాట్లాడారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు ఎల్లెల్సీ నీరు ఆలస్యంగా విడుదల విడుదల కావడం జరిగిందని దీనికి తోడు వర్షాలు లేక పోవడంతో ఉన్న పంటలు సైతం వాడు ముఖం పట్టాయన్నారు. నవంబర్ 10 వరకే సాగునీటి విడుదల వుంటుందని అధికారులు ప్రకటించారని దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతారని వివరించారు. జనవరి నెలాఖరు వరకు నీటిని విడుదల చేయాలని కోరారు. ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆస్పత్రి సబార్డినేటర్ల హర్షం

ఆలూరు రూరల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో విధులు నిర్వహిస్తున్న సబార్డినేటర్లకు రాష్ట్ర ప్రభుత్వం వారి జాబ్ చార్ట్ ప్రకారం విధులు కేటాయించడంపై ఆ సంఘం తాలుకా అధ్యక్ష, కార్యదర్శులు రంగస్వామి, రామకృష్ణ ప్రభుత్వానికి, నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశ్వర రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆస్పత్రిలో అటెండర్‌గా పనిచేసే వీరికి గతంలో వాచ్‌మన్ విధులు కూడా అప్పజెప్పడంతో ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆ సంఘం నాయకులు రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రామిరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అటెండర్లు తమ జాబ్ చార్ట్ ప్రకారం విధులు నిర్వహించాలని మంగళవారం ఉత్తర్వులు జారీ చేయడంతో ఆ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హైవే నిర్మాణం చేపట్టాలని రాస్తారోకో

ఆలూరు రూరల్: పట్టణంలో అసంపూర్తిగా ఉన్న హైవే–167 నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు, వ్యాపారస్తులు గురువారం రాస్తారోకో నిర్వహించారు. స్థానిక వాసవీ కల్యాణ మండపం నుంచి పాత బస్టాండు వరకు కంకర తేలిన రోడ్డుతో ప్రజలు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. దీనికి తోడు దుమ్ము ధూళి ఇళ్లు, దుకాణాల్లోకి వస్తోందని దీంతో అనారోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు

హొళగుంద: మండలంలో ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు చురుగ్గా సాగుతుంది. ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, కార్యదర్శి సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు తిక్కస్వామి, మాజీ ఉపాధ్యక్షుడు ముత్తన్న, మండల నాయకులు గోపినాయక్, మధు, సంజీవుడు తదితరులు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

జయప్రదం చేయండి

ఆస్పరి: కర్నూలును కరువు జిల్లాగా ప్రకటించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీన కర్నూలు కలెక్టరేట్ ముందు చేపట్టే మహాధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి విరుపాక్షి పిలుపునిచ్చారు.గురువారం స్థానిక కార్యాలయంలో ధర్నా సన్నద్ధంపై నాయకులతో చర్చించారు.